సాక్షి
కుమురం భీం
శనివారం । 3 । ఆగస్టు । 2024



కుప్టి.. కదలిక

కుప్టి ప్రాజెక్టు నిర్మాణానికి అడుగు పడింది. రాష్ట్ర బడ్జెట్‌లో రూ.234 కోట్లు కేటాయించగా.. అధికారులు క్షేత్రస్థాయిలో భూ పరిశీలన చేస్తున్నారు. 8లో▸



రాకపోకలకు నరకయాతన

వేంపల్లి రైల్వేగేటు వద్ద ఫ్లైఓవర్ ఏళ్లుగా పూర్తి కావడం లేదు. రోడ్డు కూడా గుంతలమయంగా మారడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. 9లో▸

గరిష్టం/కనిష్టం
29.5 /25.5

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. రుతుపవనాల ప్రభావంతో జిల్లాలోని చాలాప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

13 నుంచి సదరం శిబిరాలు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఈ నెల 13 నుంచి సదరం శిబిరాలు నిర్వహించనున్నట్లు డీఆర్‌డీవో సురేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13న మూగ, చెవిటి, మానసిక వైకల్యం, 16న కంటిచూపు, 27న ఎముకలకు సంబంధించిన సమస్యలు గల వారికి వైద్యపరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. శిబిరాలకు హాజరయ్యే వారు ముందుగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వికలత్వ పరీక్ష చేయించుకుని, మీసేవ కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. అర్హత గల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తపాలా సేవలపై అవగాహన

కెరమెరి(ఆసిఫాబాద్): మండలంలోని గోయగాం గ్రామంలో తపాలాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ శాఖ జిల్లా అధికారి వెంకటస్వామి మాట్లాడుతూ తపాలాశాఖను మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక సంస్కరణలు అమలు చేస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ మెరుగైన సేవలందిస్తామని తెలిపారు. ప్రజలు పోస్టాఫీసుల్లో ఖాతాలు తెరవాలని సూచించారు. వృద్ధులు, మహిళలు, చిన్నారుల కోసం అమలు చేస్తున్న బీమా, ఇతర పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. స్థానిక బీపీఎంను అడిగి వివరాలు తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో బీపీఎం శ్రీనివాస్, గ్రామస్తులు శంకర్, బాపూజీ, పోశెట్టి, బుచ్చన్న, ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిమ గిరిజనులకు విత్తనాలు పంపిణీ



విత్తనాలు అందిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, పీవో ఖుష్బూ గుప్తా, అధికారులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్ దీపక్ తివారి పలువురు ఆదిమ గిరిజన రైతులకు 12 రకాల కూరగాయల విత్తనాలు పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఆదిమ గిరిజన రైతులు కూరగాయల సాగుతో మరింత ఆదాయం పొందాలన్నారు. సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా అందించే 12 రకాల విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గర్భిణులు, బాలింతలకు సరైన పోషకాహారం అందడం లేదని, ఆకుకూరలు పండించుకుని ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలన్నారు. కొర్రలు, సామలు, రాగులు, జొన్న విత్తనాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీవీటీజీల ప్రత్యేకాధికారి మనోహర్, ఐటీడీఏ ఉద్యానవన అధికారి సందీప్, గిరిజన అభివృద్ధి శాఖ అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తుల గడువు పొడిగింపు

ఆసిఫాబాద్‌అర్బన్: ఇంటింటా ఇన్నోవేటర్–2024 కార్యక్రమం దరఖాస్తుల గడువు ఈ నెల 10 వరకు పొడిగించినట్లు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే తెలిపారు. ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల నుంచి ఆవిష్కరణలను ప్రోత్సహిస్తామని, గ్రామీణ ఆవిష్కర్తలను సాధికారత కల్పిస్తామని పేర్కొన్నారు. ఆవిష్కర్తలు అద్భుతమైన ఆలోచనలతో స్థానిక సమస్యలకు పరిష్కారం చూపే ఆవిష్కరణలు చేయాలని సూచించారు. గొప్ప ఆవిష్కర్తలను ఎంపిక చేసి ఆగస్టు 15న స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా అవార్డులు ప్రదానం చేస్తామన్నారు. దరఖాస్తులను వాట్సాప్ ద్వారా 91006 78543 నంబర్‌కు పంపించాలని సూచించారు.

రైతులకు వేగంగా విద్యుత్ కనెక్షన్లు

ఆసిఫాబాద్‌అర్బన్: వ్యవసాయ రంగ అభివృద్ధి కోసం దరఖాస్తులను వేగంగా పరిశీలించి రైతులకు విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేస్తామని విద్యుత్‌శాఖ ఎస్‌ఈ వాసుదేవ్ ఒక ప్రకటనలో తెలిపారు. 2022 డిసెంబర్ 1 నుంచి 2024 జూలై 31 వరకు 883 కనెక్షన్లు మంజూరు చేశామని పేర్కొన్నారు. గతం కంటే 98 సర్వీసు కనెక్షన్లతో 13శాతం అధికంగా మంజూరు చేశామన్నారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్థాయిని పరిశీలిస్తూ జాప్యం జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ఈ– స్టోర్స్ విధానంతో అవసరమైన మెటీరియల్‌ను ఆన్‌లైన్ ద్వారా రిజర్వ్ చేసుకుని పనులు ప్రారంభిస్తున్నామన్నారు. వంగిన స్తంభాలు, విద్యుత్ తీగలను సరి చేస్తున్నామన్నారు. సమస్యల పరిష్కారం కోసం పొలం బాట కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు.

రేషన్.. ఆశలు



వాంకిడి మండలం ఖమాన గ్రామానికి చెందిన యువ రైతు గుర్నులే మనోహర్ కుటుంబానికి రెండెకరాల పట్టా భూమి ఉంది. మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో తన భార్య పేరుతో రూ.80 వేల పంట రుణం తీసుకున్నాడు. మొదటి విడతలోనే కావాల్సిన రుణమాఫీ ఇప్పటివరకు కాలేదు. వ్యవసాయ శాఖ అధికారుల వద్దకు వెళ్లి సమస్యపై ఆరా తీయగా.. రేషన్‌కార్డు లేకపోవడమే ప్రాథమిక కారణమని తెలిసింది.



ఆసిఫాబాద్ మండలం మోతుగూడ గ్రామానికి చెందిన భీమన్‌కార్ కిరణ్‌కు వివాహమై ఎనిమిదేళ్లు అవుతుంది. ఇద్దరు పిల్లలు పుట్టినా ఇప్పటివరకు రేషన్ కార్డు లేదు. ఉచిత బియ్యం కూడా అందడం లేదు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకూ దూరం కావాల్సి వస్తుంది. రేషన్ కార్డు లేకపోవడంతో ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ పొందలేకపోతున్నాడు. వ్యవసాయం ఆధారంగా జీవిస్తున్న అతడికి గత ప్రభుత్వ హయాంలో.. ప్రస్తుతం రుణమాఫీ కాలేదు.. ఇలా జిల్లాలో రేషన్‌కార్డులు లేక చాలామంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



- నూతన కార్డుల మంజూరుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం
- జిల్లాలో ఏళ్లుగా ఎదురుచూస్తున్న అర్హులు
- సంక్షేమ పథకాలకు దూరమవుతున్నామని ఆవేదన
- విధివిధానాలు విడుదలైతే దరఖాస్తులకు అవకాశం

ఆసిఫాబాద్: జిల్లాలో అర్హులైన అనేక మంది రేషన్ కార్డుల కోసం వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల మంజూరుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపడంతో త్వరలో ఈ ప్రక్రియకు ముందడుగు పడనుంది. తాజా నిర్ణయంతో దరఖాస్తుదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. సాంకేతిక తప్పిదాలతో కొంతమంది పేర్లు రేషన్‌కార్డుల నుంచి తొలగిస్తున్నా కొత్త పేర్ల నమోదు ప్రక్రియ మాత్రం ముందుకు సాగకపోవడంతో అనేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. కొత్తగా వివాహమైన జంటలకు సైతం కొత్త కార్డులు అందడంలేదు. మరికొంత మంది పిల్లల వివరాలు కార్డులో నమోదు చేసుకునేందుకు ఏళ్లుగా మీసేవ కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రైతు రుణమాఫీ పథకం నగదు కూడా చాలా మందికి అందని పరిస్థితి. ఉచిత విద్యుత్, సబ్సిడీ గ్యాస్, ఆరోగ్యశ్రీ, విద్యార్థుల స్కాలర్‌షిప్‌లతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకోవడంతో క్షేత్రస్థాయిలో అనేక మంది ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ కార్డుల మంజూరుపై ఆరా తీస్తున్నారు. రేషన్ కార్డుదారులు రాష్ట్రంలో ఎక్కడైనా సరుకులు పొందే వెసులుబాటు పోర్టబిలిటీ ద్వారా కల్పించింది. దీంతో ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు సైతం కార్డుల కోసం ఎదురుచూస్తున్నారు.

కొత్త సభ్యుల నమోదుకు..

జిల్లాలో ప్రస్తుతం రేషన్‌కార్డులు కలిగిన వారు తమ పిల్లల పేర్లు కొత్తగా నమోదు చేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. గత 15 రోజులుగా మీసేవ కేంద్రాల్లో కొత్త పేర్లు నమోదు చేసుకునేందుకు ఆన్‌లైన్‌లో ఆప్షన్ కల్పించడంతో జిల్లాలో పలువురు దరఖాస్తు చేసుకుంటున్నారు. కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఆన్‌లైన్‌లో ప్రసుత్తం సంబంధిత వెబ్‌సైట్ తెరుచుకోవడం లేదు. తాజాగా రాష్ట్ర కేబినేట్ ఆమోదం తెలపడంతో కార్డుల మంజూరుకు మార్గం సుగమమం అయ్యింది. అయితే దీనిపై పౌరసరఫరాల శాఖ నుంచి పూర్తిస్థాయిలో మార్గదర్శకాలు విడుదల కావాల్సి ఉంది. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అర్హులు దరఖాస్తు చేసుకునే వీలుంది. ఈ విషయమై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వినోద్‌కుమార్‌ను 'సాక్షి' సంప్రదించగా.. ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు అందలేదని తెలిపారు.

ఏళ్లుగా నిరీక్షణ

జిల్లాలో ప్రస్తుతం 1,39,741 రేషన్ కార్డులు ఉన్నాయి. వీటిలో 13,166 అంత్యోదయ అన్నయోజన, 126,575 ఆహార భద్రత కార్డులు ఉండగా.. వీటి ద్వారా ప్రతినెలా 2,953.060 మెట్రిక్ టన్నుల బియ్యం లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నారు. కుటుంబ సభ్యుల్లో ఒక్కొకరికి ఆరు కిలోల బియ్యం చొప్పున ఉచిత బియ్యం అందజేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో కొత్త రేషన్‌కార్డుల కోసం 13,166 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. గత ప్రభుత్వం 2021 జూలైలో దరఖాస్తు చేసుకున్న వారిలో కొంతమంది నిరుపేదలను గుర్తించి కొత్త కార్డులు జారీ చేసింది. అయితే అర్హులైన చాలా మందికి రేషన్ కార్డులు అందలేదు. ముఖ్యంగా ఉమ్మడి కుటుంబంలో వివాహం తర్వాత చాలా మంది ప్రత్యేక రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నారు. భార్య పేరు పొందుపరచడం, కొత్తగా పిల్లల పేర్లు చేర్పించేందుకు కూడా దరఖాస్తు చేసుకుని ఏళ్ల నుంచి నిరీక్షిస్తున్నారు.

తల్లిపాల ప్రాముఖ్యతపై

అవగాహన కల్పించాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే
- వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, వివిధ శాఖల అధికారులు

ఆసిఫాబాద్: తల్లిపాల ప్రాముఖ్యతపై విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్‌తో కలిసి శుక్రవారం తల్లిపాల వారోత్సవాలకు సంబంధించి పోస్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 7 వరకు నిర్వహించే ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఆస్పత్రులు, 24 నెలలలోపు చిన్నారులు ఉన్న బాలింతల ఇళ్లను సందర్శించి తల్లిపాల ప్రాముఖ్యత తెలిసేలా అవగాహన కల్పించాలన్నారు. జన్కాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్ మాట్లాడారు. నవజాత శిశువులకు తల్లిపాలు అమృత తుల్యమన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ పుష్పలత, జిల్లా పోషణ్ అభియాన్ సమన్వయకర్త గోపాల కృష్ణ, జిల్లా మహిళా సాధికారత సమన్వయకర్తలు స్వప్న, శారద, సూపర్‌వైజర్లు పెంటుబాయి, సఖి కేంద్రం సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉత్పత్తుల ఎగుమతికి కృషి చేయాలి

జిల్లాలోని వనరులను సద్వినియోగం చేసుకుంటూ వివిధ రకాల ఉత్పత్తులను ఎగుమతి చేసేందుకు కృషి చేయాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ సమావేశానికి డీఆర్‌డీవో సురేందర్‌తో కలిసి హాజరయ్యారు. జీఐ ట్యాగ్ కలిగిన డోక్రా కాస్టింగ్ ఉత్పత్తులు ఎగుమతి చేయవచ్చన్నారు. జొన్నల ద్వారా తయారుచేసే ఆహార పదార్థాలు, వెదురు ఉత్పత్తులు, పుట్టగొడుగులు జిల్లా నుంచి ఎగుమతి చేసేందుకు సాధ్యపడుతుందన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా రెడీమేడ్ గవర్నమెంట్ యూనిట్ స్థాపించి ఉత్పత్తులు ఎగుమతి చేయవచ్చన్నారు. సమావేశంలో డీఏవో శ్రీనివాసరావు, నాబార్డ్ డీడీ వీర భద్రుడు, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ అశోక్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి

రెబ్బెన(ఆసిఫాబాద్): స్వచ్ఛదనం– పచ్చదనం కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలని డీపీవో భిక్షపతి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ, ఈజీఎస్ సిబ్బందితో స్వచ్ఛదనం– పచ్చదనం కార్యక్రమంపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. డీపీవో మాట్లాడుతూ గ్రామాల్లో ఓ వైపు పారిశుధ్య పనులు చేపడుతూనే.. మరోవైపు వనమహోత్సవం నిర్వహించాలని ఆదేశించారు. గ్రామస్తులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. అలాగే పాఠశాలల్లో పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, ప్లాస్టిక్ వినియోగం నిర్మూలనపై వ్యాసరచన పోటీలు నిర్వహించాలన్నారు. శ్రమదానం ద్వారా చిన్న చిన్న సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. తాగునీటి ట్యాంకులు శుభ్రపర్చి క్లోరినేషన్ చేపట్టాలన్నారు. డ్రైడే కార్యక్రమాలు పకడ్బందీగా అమలు చేస్తూ దోమల నివారణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ప్రతీ ఇంటికి కనీసం ఆరు మొక్కలు పంపిణీ చేయాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ రామ్మోహన్‌రావు, ఎంపీడీవో శంకరమ్మ, ఏపీఎం వెంకటరమణ శర్మ, ఏపీవో రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు నిర్భయంగా సంప్రదించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, హింస తదితర సమస్యలపై మహిళలు నిర్భయంగా జిల్లా షీటీం మొబైల్ నంబర్ 87126 70564, డయల్ 100ను సంప్రదించాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహిళలు, యువతుల రక్షణ కోసం షీటీంలు, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ టీంలు పని చేస్తున్నాయని తెలిపారు. ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేసినప్పుడే నిందితులపై చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. కళాశాలలు, పాఠశాలల విద్యార్థులకు ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, పోక్సో, షీటీం, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్‌పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. అలాగే ఉపాధిహామీ పనులకు వెళ్లేవారి కోసం కూడా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జూలైలో షీటీం ద్వారా మూడు కేసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశామని, 28 అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. సోషల్ మీడియా వినియోగంలో ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

'స్వచ్ఛదనం– పచ్చదనం' విజయవంతం చేయాలి

- అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్




మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 5 నుంచి 9 వరకు నిర్వహించే స్వచ్ఛదనం– పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి ప్రత్యేకాధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎంపీవోలు, పంచాయతీ ప్రత్యేకాధికారులు, అటవీశాఖ అధికారులు, ఉపాధిహామీ సిబ్బంది, ఐకేపీ ఏపీఎంలు, సీసీలు, పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛదనం– పచ్చదనం కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, యువజన సంఘాలు, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, అధికారులతోపాటు ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. ప్రతిరోజూ చేపట్టే కార్యక్రమాలపై సమావేశాలు నిర్వహించాలన్నారు. ప్రత్యేకాధికారులు పర్యవేక్షిస్తూ నివేదికలు రూపొందించాలని ఆదేశించారు. ఈ నెల 5న ర్యాలీలు నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 9 వరకు షెడ్యూల్ ప్రకారం పలు కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో సురేందర్, డీపీవో భిక్షపతి, ఆర్డీవోలు లోకేశ్వర్‌రావు, సురేశ్, అదనపు డీఆర్‌డీవో రామకృష్ణ, మున్సిపల్ కమిషనర్ భుజంగరావు పాల్గొన్నారు.


ఆసిఫాబాద్ ఎఫ్ఆర్‌వోగా గోవింద్‌సింగ్ సర్దార్

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ అటవీశాఖ రేంజ్ అధికారిగా గోవింద్‌సింగ్ సర్దార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా కుశ్నపల్లి రేంజ్ అధికారిగా పని చేస్తున్న ఆయన ఆసిఫాబాద్‌కు బదిలీ అయ్యారు. కార్యాలయ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. ఆసిఫాబాద్ రేంజ్ అధికారిగా పనిచేస్తున్న అప్పలకొండ నీల్వాయి రేంజ్ అధికారిగా బదిలీపై వెళ్లారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలి



క్రీడలు ప్రారంభిస్తున్న డీఎస్‌వో మీనారెడ్డి



రన్నింగ్ పోటీలో విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్: రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటాలని డీఎస్‌వో మీనారెడ్డి, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆదర్శ క్రీడా పాఠశాలలో శుక్రవారం జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాస్థాయి అథ్లెటిక్స్‌లో భాగంగా అండర్ 14, 16, 18, 20 విభాగాల్లో 100, 400 మీటర్ల రన్నింగ్ పోటీలతోపాటు జావెలిన్ త్రో పోటీలకు 200 మంది హాజరయ్యారని తెలిపారు. ఇందులో ఉత్తమ ప్రతిభ చూపిన 20 మంది క్రీడాకారులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశామని తెలిపారు. ఈ నెల 7న ఒలింపిక్ పతక విజేత నీరజ్‌చోప్రా జన్మదినం సందర్భంగా హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ కోచ్‌లు విద్యాసాగర్, రవి, సుధాకర్, పీఈటీలు, పీడీలు తదితరులు పాల్గొన్నారు.

నిర్వహణకు నిధుల కొరత

- సామగ్రి కొనుగోలుకు ఉపాధ్యాయులకు తప్పని తిప్పలు
- జిల్లాలో 721 ప్రభుత్వ పాఠశాలలు



ఆసిఫాబాద్ బాలుర ఉన్నత పాఠశాల


ఆసిఫాబాద్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం సర్కారు బడుల నిర్వహణ విడుదలలో జాప్యం చేస్తోంది. ఫలితంగా చిన్న చిన్న అవసరాలకు కూడా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. మరో పది రోజులు గడిస్తే 2024– 25 విద్యా సంవత్సరం ప్రారంభమై దాదాపు రెండు నెలలు పూర్తవుతుంది. సాధారణంగా రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలకు ఏటా రెండు విడతల్లో నిర్వహణ నిధులు విడుదల చేస్తుంది. పాఠశాలలు ప్రారంభమైన జూన్‌లోనే నిర్వహణ నిధులు రావాల్సి ఉండగా ఇప్పటివరకు ఖాతాల్లో జమ కాలేదు. ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 30 మంది విద్యార్థులు ఉంటే రూ.10,000, 31 నుంచి 100 వరకు రూ.25,000, 101 నుంచి 250 వరకు రూ.50,000, 251 నుంచి 1000 రూ.75,000, అంతకంటే ఎక్కువ మంది విద్యార్థులు ఉంటే దాదాపు రూ.లక్ష వరకు నిధులు మంజూరు చేస్తారు.

37,948 మంది విద్యార్థులు

జిల్లావ్యాప్తంగా 721 ప్రభుత్వ పాఠశాలు ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలలు 561 ఉండగా.. ప్రాథమికోన్నత పాఠశాలలు 100, ఉన్నత పాఠశాలలు 60 వరకు ఉన్నాయి. 2024– 25 విద్యా సంవత్సరంలో జిల్లావ్యాప్తంగా ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు 37,948 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పాఠశాలల్లో చాక్‌పీస్‌లు, హాజరు పుస్తకాలు, రిజిస్టర్లు, డస్టర్లు, చీపుర్లు, సైన్స్ ల్యాబ్‌లకు సామగ్రి, తదితర సామగ్రితోపాటు విద్యుత్ బిల్లులు చెల్లింపులు చేపట్టాల్సి ఉంటుంది. ఇందుకు జూన్‌లోనే మంజూరు కావాల్సిన నిర్వహణ నిధులు ఇప్పటివరకు అందలేదు. పలుచోట్ల ఉపాధ్యాయులే సొంతంగా డబ్బులు వెచ్చించి నిర్వహణ చూసుకోవడంతోపాటు సామగ్రి కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తుంది. అయితే విద్యార్థులు ఎక్కువగా ఉన్నచోట మాత్రం ఆర్థికంగా భారంగా పడుతుందని ప్రధానోపాధ్యాయులు వాపోతున్నారు. ఉపాధ్యాయులు కూడా పట్టించుకోని పాఠశాలల్లో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఇదే విషయంపై డీఈవో అశోక్‌ను వివరణ కోరగా.. పాఠశాలల నిర్వహణకు ఈ నెలలో నిధులు విడుదలయ్యే అవకాశం ఉందని తెలిపారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని ప్రధానోపాధ్యాయులకు సూచించామన్నారు. అత్యవసరాలు తప్పనిసరిగా కొనుగోలు చేయాలని ఆదేశించామని స్పష్టం చేశారు.

నిబంధనలు పాటించకపోవడంతోనే ప్రమాదాలు

- ఎస్పీ డీవీ శ్రీనివాసరావు
- ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



మాట్లాడుతున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్: ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. చిన్న చిన్న పొరపాట్లతో రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయి కుటుంబానికి దూరం కావొద్దని, ప్రమాదాల నివారణలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్‌లో శుక్రవారం రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులు, వ్యాపారులు, కళాశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న తీరు, నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతోనే ప్రమాదాలను పూర్తిగా నివారించవచ్చన్నారు. హెల్మెట్ ఆవశ్యకత, సీట్ బెల్ట్ ధరించడం, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, డ్రంకెన్ డ్రైవ్, ఓవర్ స్పీడ్, డేంజరస్ డ్రైవింగ్, లెఫ్ట్ సైడ్ నుంచి ఓవర్ టేక్ చేయడం వంటి వాటిపై పోలీసుశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణాల్లో ప్రత్యేకంగా రెండు టీంలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. జిల్లాలో 45 బ్లాక్‌స్పాట్స్(ప్రమాదాలు జరిగే ప్రదేశాలు)ను గుర్తించినట్లు తెలిపారు. ఆయా ప్రదేశాల్లో ఈ ఏడాది 80 ప్రమాదాలు చోటుచేసుకోగా 97 మంది గాయపడినట్లు వివరించారు. మరణాల్లో 70 శాతం జాతీయ రహదారిపై జరిగినట్లుగా గుర్తించామన్నారు. నిర్లక్ష్యం, అతివేగంతోనే ఈ ప్రమాదాలు జరిగినట్లు స్పష్టం చేశారు. రోడ్డు పక్కన విద్యాసంస్థలు ఉన్న స్థలాల్లో విద్యార్థులు రోడ్డు దాటే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. రోడ్లపై వర్షపు నీరు నిలిచి వాహనాలు అదుపు తప్పే అవకాశం ఉంటుందని, వాహనదారులు జాగ్రత్తలు పాటించాలన్నారు. పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రతిరోజూ వాహనాల తనిఖీ చేపడుతున్నామని పేర్కొన్నారు. మైనర్లు వాహనం నడిపితే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ తగిన జాగ్రత్తలు పాటిస్తామని సామూహిక ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, ఆర్టీవో రాంచందర్, డీఎస్పీ సదయ్య, సీఐ సతీశ్, సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అద్దెకు ఆర్టీసీ బస్సులు

ఆదిలాబాద్: వివాహాలు, విహారయాత్రలు, శుభకార్యాలకు సంబంధించి అద్దె ప్రతిపాదికన ఆర్టీసీ బస్సులు నడుపుతున్నట్లు ఆదిలాబాద్ ఆర్ఎం సోలోమన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని డిపోల పరిధిలో బస్సులను ముందస్తు బుక్ చేసుకుని సేవలు పొందవచ్చని తెలిపారు. వివరాలకు ఆదిలాబాద్, ఉట్నూర్ డిపోలకు సంబంధించి 99592 26002, నిర్మల్ 99592 26003, మంచిర్యాల 99592 26004, భైంసా 99592 26005, ఆసిఫాబాద్ 99592 26006 సెల్ నంబర్లలో డిపో మేనేజర్లను సంప్రదించాలని సూచించారు. సురక్షిత ప్రయాణానికి ఆర్టీసీ కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సెక్యూరిటీ గార్డుల బదిలీ

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో విధులు నిర్వహిస్తున్న నలుగురు సీనియర్ సెక్యూరిటీ గార్డులను బదిలీ చేస్తూ జీఎం పర్సనల్ (కార్పొరేట్) నుంచి శుక్రవారం ఆదేశాలు జారీ అయ్యాయి. బండిపెల్లి రమేశ్‌ని ఎస్బీ (హైదరాబాద్), జవాజి బాబుని రామగుండం-2 డివిజన్, జంగ కృష్ణస్వామిని మణుగూర్‌కు, అనుగుల రాజయ్యని భూపాలపల్లి డివిజన్‌కు బదిలీ చేశారు. మందమర్రి ఏరియాలోని ఒక సీనియర్ సెక్యూరిటీ గార్డు తనకు ఎస్బీ(హైదరాబాద్) విభాగానికి బదిలీ కావాలని గతంలో దరఖాస్తు చేసుకున్నాడు. బదిలీ ఉద్యోగులకు సంస్థ ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్ పేరిట వారి బేసిక్‌ను బట్టి చెల్లిస్తోంది. ఆ గార్డుకు ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్ లేకుండా జరగాల్సిన బదిలీని అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్ పేరిట చేయడంతో సంస్థకు ట్రాన్స్‌పోర్ట్ పేరిట రూ.70 వేల నుంచి 80 వేలు నష్టం జరుగుతుందని పలువురు విమర్శిస్తున్నారు. ఇదిలా ఉంటే సింగరేణిలో రెండు మూడేళ్లకోసారి జరగాల్సిన అధికారుల బదిలీల్లో జాప్యం జరుగుతోంది. సింగరేణి వ్యాప్తంగా 200లకు పైగా అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్లో అధికారుల బదిలీలు జరగాల్సి ఉంది. ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్ కింద ఒక్కో అధికారికి రూ.లక్షా 50 వేల నుంచి రూ.2 లక్షల వరకు సంస్థ చెల్లించాల్సి ఉంటుంది. దాని వల్లనే బదిలీలు జరగడం లేదనే పలువురు పేర్కొంటున్నారు.

ఆటో బోల్తాపడి సాత్‌క్యాంపస్ విద్యార్థి మృతి

కామారెడ్డిక్రైం: ఆటో బోల్తాపడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లా సాంగ్వి గ్రామానికి చెందిన బేదడ్కర్ ప్రీతమ్(27) భిక్కనూరు సౌత్‌క్యాంపస్‌లో ఉంటూ పీజీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. వ్యక్తిగత పనులపై శుక్రవారం సాయంత్రం కామారెడ్డికి వచ్చాడు. అతడు ప్రయాణిస్తున్న ఆటో ప్రియా థియేటర్ రోడ్ క్రాసింగ్ వద్ద అదుపు తప్పి బోల్తాపడింది. తలకు బలమైన గాయం కావడంతో ప్రీతమ్‌ను జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించిన కొద్దిసేపటికే మృతిచెందాడు. ప్రీతమ్ తండ్రి రాంకిషన్ నాలుగు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆదిలాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం డిశ్చార్జి అయ్యారు. ప్రీతమ్ మృతితో సౌత్‌క్యాంపస్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

రైతులకు చెక్కు అందజేత

బాసర: గోదావరి నది నీటిపారుదల లిఫ్ట్ ఇరిగేషన్ పథకం అభివృద్ధి కోసం మండల కేంద్రంలోని శ్రీవేదభారతి పీఠం వ్యవస్థాపకుడు శ్రీ వేద విద్యానందగిరి స్వామి రూ.50 వేలు ప్రకటించారు. శుక్రవారం రైతులకు ఈ చెక్కు అందజేశారు. ప్రతిఏటా రూ.లక్ష వరకు ఆర్థిక సాయం అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. మండల కేంద్రంలో రైతులందరూ పంటలు పండించాలన్నారు.

కుప్టి.. కదలిక

- రాష్ట్ర బడ్జెట్‌లో ప్రాజెక్టుకు రూ.234 కోట్లు
- భూపరిశీలనలో అధికారులు
- ముందు ముంపు పరిహారం తేల్చాలంటున్న రైతులు


నేరడిగొండ మండలం కుప్టి వద్ద భూములను గురువారం పరిశీలిస్తున్న అధికారులు

ప్రాజెక్ట్ స్వరూపం ఇలా..

నీటి నిల్వ సామర్థ్యం	5.30 టీఎంసీలు
నీటిమట్టం	394.00 మీటర్లు
జలమార్గం	
రేడియల్ గేట్లు స్పిల్‌వేతో నిర్మాణం	

ముంపు గ్రామాలు..

నేరడిగొండ మండలంలోని కుమారి, గాజిలి, గాంధారి, కుప్టి

గడిచిన నాలుగేళ్లుగా డీపీఆర్ అంచనా వ్యయం వివరాలు..

సంవత్సరం	డీపీఆర్ అంచనా వ్యయం
2020-21	రూ.846.737 కోట్లు
2021-22	రూ.900 కోట్లు
2022-23	రూ.1,100 కోట్లు
2023-24	రూ.1,323 కోట్లు

సాక్షి,ఆదిలాబాద్: ఎట్టకేలకు కుప్టి ప్రాజెక్టు నిర్మాణానికి అడుగు పడింది. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌లో రూ.234 కోట్ల పద్దు కేటాయించింది. తొమ్మిదేళ్లుగా ఇప్పుడు.. అప్పుడు అంటూ వచ్చిన ఈ ప్రాజెక్టు విషయంలో ఎట్టకేలకు కదలిక వచ్చింది. బడ్జెట్ కేటాయింపు నేపథ్యంలో సాగునీటి, రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగారు. ప్రాజెక్టు అమరిక కోసం భూమిని పరిశీలించారు. కాగా ముంపు భూములకు పరిహారం తేల్చిన తర్వాతే ఏదైనా అని నిర్వాసితులు స్పష్టం చేస్తూ అధికారుల చర్యలను అడ్డుకుంటున్నారు.

2500 ఎకరాలు..

కుప్టి ప్రాజెక్టు నిర్మాణం కోసం నాలుగు గ్రామాల్లో 2,500 ఎకరాలు అవసరం అవుతుందని సాగునీటి పారుదల శాఖ అధికారులు అంచనా వేశారు. తాజాగా బడ్జెట్ మంజూరు తర్వాత దీనికి సంబంధించి పూర్తిస్థాయి పరిశీలన చేయాల్సి ఉంది. ఇందులో భాగంగా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నారు. 900 ఇళ్లు కూడా కోల్పోయే పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో నిర్వాసితులు ముందుగా పరిహారం ఎంత ఇస్తారనేది తేల్చాలని డిమాండ్ చేస్తున్నారు. ఆ తర్వాతే దీనిపై సర్వే చేసుకోవాలని చెబుతున్నారు.

కడెం ఆయకట్టు స్థిరీకరించేందుకు..

బచావత్ అవార్డు ప్రకారం కడెం రిజర్వాయర్‌కు 68,150 ఎకరాల ఆయకట్టుకు 13.42 టీఎంసీల నీటిని వినియోగించుకోవచ్చని ఉంది. అయితే ఈ ప్రాజెక్టు వానాకాలంలో మాత్రమే నీటిని స్వీకరిస్తుంది. అది కూడా 7.20 టీఎంసీలకు మాత్రమే పరిమితమైంది. ఆయకట్టుకు నీటి డిమాండ్ ప్రధానంగా అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు ఉంటుంది. ప్రతి పంట కాలం ముగిసే సమయానికి నీటి కొరత ఏర్పడుతుంది. ఇది రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య. 42,883 ఎకరాలకు మాత్రమే కడెం ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. మిగతా 25,267 ఎకరాల ఆయకట్టును స్థిరీకరించేందుకు ఈ ప్రాజెక్టు ఎగువన ఉన్నటువంటి పరివాహక ప్రాంతమైనటువంటి కుప్టి వద్ద ఈ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించాలని తొమ్మిదేళ్ల క్రితం.. అంటే 2015లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. కడెం ఆయకట్టుకు అనుబంధంగా ఈ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఉంటుంది. 2020-21 నుంచి పలుమార్లు డీపీఆర్ మారుతూ రాగా అంచనా వ్యయం పెరుగుతూ వచ్చింది.

సామర్థ్యం పెంచే అవకాశాలు లేకపోవడంతో..

కడెం ప్రాజెక్టును 1958 సంవత్సరంలో నిర్మించారు. 7.20 టీఎంసీల నీటి సామర్థ్యంతో నిర్మించిన ఈ ప్రాజెక్టుకు 18 గేట్లు ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లాలోని నేరడిగొండ, ఇచ్చోడ మండలాల మధ్యలో ఉన్న కుప్టి గ్రామం నుంచి నీటి పరివాహకం ఉంది. ఈ నీరే కడెం ప్రాజెక్టుకు చేరుతుంది. బచావత్ అవార్డు ప్రకారం 13.42 టీఎంసీల నీటిని వినియోగించుకునేందుకు అవకాశం ఉన్నప్పటికీ కడెం వద్ద అటవీ సంపదను దృష్టిలో పెట్టుకొని ప్రాజెక్టు సామర్థ్యాన్ని పెంచే అవకాశాలు లేవు. దీంతోనే ప్రభుత్వం ఎగువ ప్రాంతంలో ఉన్నటువంటి కుప్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణానికి బీజం వేసింది. ఇందులో భాగంగానే కుప్టి బహుళార్థసాధక ప్రాజెక్టు నిర్మించాలని తలపెట్టారు. ఆయకట్టు స్థిరీకరణ, విద్యుత్ ఉత్పత్తి, తాగునీటి సదుపాయం అందించడం వంటి ప్రయోజనాలతో దీన్ని చేపట్టాలని యోచిస్తున్నారు.

వివరాలను ముందుంచి ప్రాజెక్టు పనులు చేయాలి..



ప్రభుత్వం రూపొందించిన డీపీఆర్‌ను ప్రజల ముందు ఉంచి నిర్వాసితుల భూములకు సంబంధించి న్యాయబద్ధమైన రేటు నిర్ణయించాలి. భూములు, ఇళ్లు కోల్పోతున్న నిరుపేదలకు న్యాయం చేయాలి. పునరావాసం కల్పించాలి. రీహాబిటేషన్ ప్రక్రియకు సంబంధించిన వివరాలను విధానపరంగా ప్రజల ముందుంచి తర్వాతే చేపట్టాలి.

– గడ్డం భీంరెడ్డి, కుమారి గ్రామం

భూసేకరణ కోసం సర్వే..



కుప్టి ప్రాజెక్టు నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇందులో భాగంగా మొదట భూసేకరణ కోసం రెవెన్యూ విభాగంతో కలిసి సాగునీటిపారుదల శాఖ అధికారులం ముందుకెళ్తున్నాం. గతంలో ఇంత భూమి కావాలని అంచనా వేయడం జరిగింది. తాజాగా రెవెన్యూ పూర్తిస్థాయిలో సర్వే చేసి ఆ భూమిని నిర్ధారించడం జరుగుతుంది.

– భీంరావు, డీఈ, సాగునీటి పారుదల శాఖ, ఆదిలాబాద్

ప్రధాన ప్రయోజనాలు..

- మూడు మెగావాట్ల జల విద్యుత్ ఉత్పత్తి
- బోథ్ నియోజకవర్గంలో భవిష్యత్తులో లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల ద్వారా కొత్తనీటి పారుదల సామర్థ్యాన్ని సృష్టించేందుకు అవకాశాలు
- నీటి ప్రవాహం కొనసాగడంతో కుంటాల జలపాతం సహజ సౌందర్యం చాలా కాలం పాటు ఉంటుంది. తద్వారా ప్రభుత్వానికి పర్యాటకుల ద్వారా ఆదాయం సమకూరుతుంది.
- కడెం ఆయకట్టు నుంచి గోదావరి నదిలో పునరుత్పత్తి నీటి కారణంగా గూడెం, ధర్మపురి వద్ద గోదావరి నదికి నీరు చేరడం ద్వారా సమీపంలో ఉన్న దేవాలయాలకు ఎక్కువ మంది యాత్రికులు ఆకర్షితులయ్యే అవకాశం ఉంటుంది.

ప్రాజెక్టు వివరాలు వెల్లడించాకే పనులు చేపట్టాలి

- సర్వేను అడ్డుకున్న కుప్టి ప్రభావిత గ్రామస్తులు


ఇన్‌చార్జి తహసీల్దార్ మహేశ్‌కు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

నేరడిగొండ: మండలంలోని కుప్టి వద్ద నిర్మించ తలపెట్టిన ప్రాజెక్టు వివరాలు వెల్లడించాకే పనులు చేపట్టాలని గ్రామస్తులు స్పష్టం చేశారు. గురువారం స్థల పరిశీలనకు వచ్చిన ఉన్నతాధికారులను స్థానికులు అడ్డుకున్న విషయం తెలిసిందే. శుక్రవారం మరోసారి ఇరిగేషన్, రెవెన్యూశాఖ అధికారులు కుప్టి వద్ద జెండాలు పాతేందుకు చేరుకున్నారు. ఈ క్రమంలో కుప్టి, కుమారి, గాజిలి, గాంధారి గ్రామాలకు చెందిన రైతులు, గ్రామస్తులు అక్కడికి చేరుకుని పనులను అడ్డుకున్నారు. ప్రాజెక్టు కింద ముంపునకు గురయ్యే వ్యవసాయ భూములు, నివాస గృహాలకు పరిహారం తేల్చిన తర్వాతే పనులు చేపట్టాలని పేర్కొన్నారు. ఆ తర్వాతే స్థల నిర్ధారణ, అలైన్‌మెంట్ పరిశీలన చేపట్టాలని డిమాండ్ చేశారు. దీంతో అధికారులు వెనుదిరిగారు. అనంతరం గ్రామస్తులు ఇన్‌చార్జి తహసీల్దార్ మహేశ్‌కు వినతిపత్రం అందజేశారు.

49 కేసులు.. 80 మందికి జైలు

- రూ.59 వేలు జరిమానా
- నేరం చేసిన వారికి శిక్షలు తప్పవు
- రామగుండం సీపీ శ్రీనివాసులు


సీపీ శ్రీనివాసులు

మంచిర్యాలక్రైం: నేరం చేసిన వారికి శిక్షలు తప్పవని రామగుండం సీపీ ఎం.శ్రీనివాసులు ఓ ప్రకటనలో హెచ్చరించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఈ ఏడాది జనవరి నుంచి గత జూలై వరకు వివిధ నేరాలు జరిగాయని పేర్కొన్నారు. ఏడునెలల వ్యవధిలో 49 కేసుల్లో 80 మందికి జైలుశిక్ష పడ్డాయని, రూ.59 వేలు జరిమానా రూపంలో చెల్లించారని తెలిపారు. నేరం చేసినవారికి శిక్ష పడేలా ఇన్వెస్టిగేషన్ అధికారి సాక్ష్యాధారాలు సేకరించాలని పేర్కొన్నారు. దర్యాప్తులో అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని తెలిపారు.

కాంట్రాక్టు కార్మికులుగా గుర్తించాలి


ఎమ్మెల్యే వివేక్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: సింగరేణి బొగ్గు లోడింగ్, అన్ లోడింగ్ కార్మికులను కాంట్రాక్టు కార్మికులుగా గుర్తించాలని కోల్ ట్రాన్స్‌పోర్టు లోడింగ్, అన్ లోడింగ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాకూబ్ వలీ, సీపీఐ (ఎంఎల్)ప్రజాపంథా మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి జాడి దేవరాజ్ డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో చెన్నూర్, రామగుండం, ఇల్లందు ఎమ్మెల్యేలు గడ్డం వివేక్ వెంకటస్వామి, మక్కాన్‌సింగ్ ఠాకూర్, కోరం కనకయ్యలను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బొగ్గు లోడింగ్, అన్ లోడింగ్ కార్మికులు 40 ఏళ్లుగా పని చేస్తున్నారన్నారు. లోడింగ్ కార్మికులతో సొసైటీలు ఏర్పాటు చేసి యాజమాన్యం వేతనాలు ఇవ్వాలన్నారు. భూపాలపల్లి శ్రీరాంపూర్, మణుగూరు ఏరియాల నాయకులు పాల్గొన్నారు.

కిరాణా సామగ్రి దగ్ధం

గుడిహత్నూర్: మండలంలోని గురుజ గ్రామంలో గురువారం రాత్రి కిరాణా షాపులో దేవుని చిత్రపటాల వద్ద వెలిగి ఉన్న దీపం కిందపడి కార్టూన్ డబ్బాలకు తగిలి మంటలు చెలరేగింది. అగ్నికి కిరాణా సామగ్రి దగ్ధమైంది. ఫర్నిచర్‌తో సహా సుమారు రూ.4 లక్షల నష్టం వాటిల్లిందని బాధితురాలు నేతుల మమత తెలిపింది.

విధులకు వెళ్తూ..కానరాని లోకాలకు

- రోడ్డు ప్రమాదంలో సింగరేణి కార్మికుడి మృతి

నస్పూర్: విధులకు వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో సింగరేణి కార్మికుడు మృతిచెందాడు. సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్సై నెల్కి సుగుణాకర్ కథనం ప్రకారం.. రామకృష్ణాపూర్‌లోని కుర్మపల్లిలో నివాసం ఉండే బైర శ్రీనివాస్ (31) రామగుండం జీడీకే-1 ఇంక్లైన్‌లో జనరల్ మజ్దూర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం ఇంటి నుంచి జీడీకే-1 ఇంక్లైన్‌లో రెండో షిఫ్ట్‌నకు వెళ్లేందుకు బైక్‌పై బయల్దేరాడు. మందమర్రి శ్రీరాంపూర్ జాతీయ రహదారి బైపాస్‌పై సీసీసీ ముక్కిడిపోచమ్మ ఆలయ సమీపంలో వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో శ్రీనివాస్ కిందపడిపోయాడు. వెనుక నుంచి వచ్చిన లారీ అతడిపై వెళ్లింది. తీవ్రగాయాలైన క్షతగాత్రుడిని వాహనదారులు మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. తండ్రి బక్కయ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.


శ్రీనివాస్ (ఫైల్)

బహిర్భూమికి వెళ్లి.. ఫిట్స్‌తో వాగులో పడి


సత్తయ్య (ఫైల్)

భీమిని: బహిర్భూమికి వెళ్లిన వ్యక్తి ఫిట్స్ రావడంతో వాగులో పడి మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన కొవ్వూరి సత్తయ్య (47) గత కొంతకాలంగా ఫిట్స్‌తో బాధపడుతున్నాడు. శుక్రవారం ఉదయం స్థానిక ఎర్రవాగుకు బహిర్భూమికి వెళ్లాడు. అనంతరం ఆయనకు ఫిట్స్ రావడంతో వాగులో పడి మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో కుటుంబసభ్యులు అక్కడికి చేరుకున్నారు. అప్పటికే సత్తయ్య మృతి చెంది ఉన్నాడు. మృతుడికి భార్య సుశీల, కుమారుడు అంజన్న ఉన్నారు. ఈ విషయమై ఎస్సై విజయ్‌కుమార్‌ని సంప్రదించగా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

వైద్యులు, ఫార్మసిస్టులను నియమించాలి


సీఎండీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆసుపత్రిలో వైద్యులు ఫార్మసిస్టులను నియమించాలని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సీఎండీ బలరాం నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏరియా ఆసుపత్రి స్థితిగతులను వివరించి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వైద్యులు, సిబ్బంది పోస్టులు భర్తీ చేసి కార్మికులకు మెరుగైన వైద్యసేవలందించాలన్నారు. దీంతో సీఎండీ సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, ఏరియా కార్యదర్శులు వెంకటేశ్, సంపత్, నాయకులు మంగీలాల్, సత్యనారాయణ, చంద్రశేఖర్, కిరణ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వినోద్‌కు వినతి

ఏరియా ఆసుపత్రిని పరిరక్షించడానికి చర్యలు తీసుకోవాలని బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆసుపత్రి పరిరక్షణ కమిటీ నాయకులు ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు వినతిపత్రం అందజేశారు. స్పెషలిస్టు వైద్యులు, ఖాళీగా ఉన్న వైద్యులు, సిబ్బందిని నియమించాలని కోరారు. ఈమేరకు సింగరేణి సీఎండీ బలరాం నాయక్‌తో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి బెల్లంపల్లికి సీఎంఓను పంపిస్తానని చెప్పారని ఎమ్మెల్యే వివరించారు. నాయకులు రాజమొగిలి, జయరాం, అఫ్జల్, చిప్పనర్సయ్య, మల్లేశ్, ఐలయ్య, మణిరాంసింగ్, గోపాల్, చాంద్‌పాషా, ఓజియార్, మహేందర్, రాజన్న, శంకర్, పోశమల్లు పాల్గొన్నారు.

గుడుంబా పట్టివేత

మందమర్రిరూరల్: మండలంలోని పొన్నారం గ్రామంలో సత్తెమ్మ ఇంటి ఆవరణలో 60 గుడుంబా ప్యాకెట్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ఇన్‌స్పెక్టర్ లచ్చన్న తెలిపిన వివరాల ప్రకారం.. పొన్నారంలో గుడుంబా అమ్ముతున్నారనే సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. 60 గుడుంబా ప్యాకెట్లు లభించాయి. ప్యాకెట్లతోపాటు మహిళను తదుపరి విచారణ నిమిత్తం రామకృష్ణాపూర్ పోలీసులకు అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

గుడుంబా విక్రేతపై కేసు

కెరమెరి: మండలంలోని దేవాపూర్ గ్రామానికి చెందిన గుడుంబా విక్రేత జాదవ్ అనిల్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గుంపుల విజయ్ తెలిపారు. అక్రమ మార్గాన గుడుంబాను ఇంట్లో తయారు చేసి గ్రామంలో విక్రయిస్తున్నాడని పేర్కొన్నారు. శుక్రవారం ఐదు లీటర్ల గుడుంబా డబ్బా పట్టుకుని విక్రయించేందుకు సిద్ధంగా ఉండగా ఇంటివద్దే పట్టుకున్నామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


తోకల కృష్ణ (ఫైల్)

బెల్లంపల్లిరూరల్: మండలంలోని కన్నాల గ్రామ పంచాయతీ పరిధి లక్ష్మీపూర్‌లో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన తోకల కృష్ణ(కిష్టయ్య) కూలీ పనులు, మత్స్యకారుడుగా జీవనం సాగిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం కన్నాల శివారులోని తన పొలం వద్దకు ద్విచక్ర వాహనంపై వెళ్లి వ్యవసాయ పనులు చేసుకుని రాత్రి సమయంలో తిరిగి ఇంటికి వస్తున్నాడు. గ్రామంలోకి వచ్చే క్రమంలో రోడ్డుపై ఉన్న టవేరా వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో కిందపడి తీవ్ర గాయాలు కావడంతో బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కృష్ణ(52)ను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు. ఈ విషయమై తాళ్లగురిజాల పోలీసులను సంప్రదించగా ఫిర్యాదు అందలేదన్నారు.

బడిలో పాము కలకలం

- పరుగులు తీసిన విద్యార్థులు
- ఆదిలాబాద్ జిల్లా బట్టిసావర్గాం యూపీఎస్‌లో ఘటన


పామును పట్టుకున్న యువకుడు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ జిల్లా మావల మండలంలోని బట్టిసావర్గాం యూపీఎస్‌లో శుక్రవారం పాము కలకలం రేపింది. విద్యార్థులు భయభ్రాంతులకు గురయ్యారు. ఒక్కసారిగా కేకలు వేయడంతో ఏం జరిగిందోనని ఉపాధ్యాయులు, స్థానికులు ఆందోళన చెందారు. ఉదయం పాఠశాలకు వచ్చిన విద్యార్థులు గదిలో పామును చూసి కేకలు వేస్తూ పరుగు పెట్టారు. విషయాన్ని ప్రధానోపాధ్యాయుడు గ్రామస్తులకు తెలియజేయడంతో ఓ యువకుడు ఆ పామును పట్టుకున్నాడు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కాగా పాఠశాల ఆవరణలో పల్లె ప్రకృతి వనం నర్సరీ ఉండడంతోనే పాములు వస్తున్నాయని, రెండో తరగతి గదిలో పామును చూసి చిన్నారులు కేకలు పెట్టారని హెచ్ఎం రవికుమార్ తెలిపారు. పాములతో పాటు ఇతర విషకీటకాలు ఆవరణలో సంచరిస్తున్నట్లు పేర్కొన్నారు. పల్లెప్రకృతి వనం నర్సరీని మరో ప్రాంతానికి తరలించాలని కోరారు.

పారదర్శకంగా జనరల్ మజ్దూర్ల భర్తీ


కార్మికులతో మాట్లాడుతున్న ఎస్కే బాజీ సైదా

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలో 108 సర్ఫేస్ జనరల్ మజ్దూర్ ఖాళీలను పారదర్శకంగా భర్తీ చేస్తున్నారని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచి కార్యదర్శి ఎస్కే.బాజీసైదా తెలిపారు. శుక్రవారం ఆయన ఎస్సార్పీ 3, 3ఏ గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కార్మికులతో మాట్లాడారు. సర్ఫేస్‌లో జనరల్ మజ్దూర్ ఖాళీల భర్తీకి యాజమాన్యం ఇటీవల నోటిఫికేషన్ ఇచ్చిందని, అండర్ గ్రౌండ్‌లో అన్ని కేటగిరీల వారు దరఖాస్తు చేసుకునే అవకాశం మొదటిసారిగా తాము గెలిచిన తరువాత కల్పించామని పేర్కొన్నారు. సీనియారిటీ, మార్కుల జాబితాలో పొరపాట్లు ఉంటే కార్మికులు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లాలని అన్నారు. కార్మికులు ఎవరి మాటలు నమ్మి మోసపోవద్దని తెలిపారు. కార్మికులు పాన్‌కార్డును ఆధార్ కార్డుతో లింక్ చేసుకోకపోవడం వల్ల ఆదాయపన్ను శాఖ అధికారులు జీతంలో రికవరీకి ఆదేశాలు ఇచ్చారని, ఇప్పటికైనా కార్మికులు పాన్‌కార్డుకు ఆధార్‌ను లింకు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో యూనియన్ బ్రాంచి సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, ఫిట్ సెక్రెటరీ మురళిచౌదరి, నాయకులు తోట మల్లేష్, అంబాల రవి, రాచర్ల రవీందర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఊరు దాటాలంటే.. వాగు దాటాలె



చింతలమానెపల్లి: మండలంలోని గూడెం పంచాయతీ పరిధిలోని శివపెల్లి గ్రామస్తులు ఊరు దాటాలంటే వాగు దాటి రావాల్సిందే. గూడెం చేరుకోవడానికి రెండు వాగులు దాటి 3 కి.మీ బురదలో ప్రయాణం చేయాలి. శుక్రవారం మహిళలు వాగు నుంచి దాటుతూ కనిపించారు. యువకుడు తన బైక్‌ని ఎడ్లబండిపై తరలించారు. అధికారులు స్పందించి గ్రామానికి తారురోడ్డు సౌకర్యం కల్పించాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.